కందుల కొనుగోలు ప్రారంభం

రైతులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్, బీజేపీ, రైతు సంఘాల నాయకులు

నమస్తే ఎఫెక్ట్

బేల, ఫిబ్రవరి 19 : ఆదిలాబాద్ జిల్లా బేల మార్కెట్‌లో కందుల కొనుగోళ్ల జాప్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బుధవారం 'నమస్తే తెలంగాణ'లో కంది కొనుగోళ్లలో జాప్యమెందుకు? ప్రచురితమైన కథనానికి అన్ని రాజకీయ పార్టీ నాయకులు స్పందించారు. రైతు సంఘాలు, వామపక్షాల నాయకులు బుధవారం మార్కెట్ యార్డుకు వెళ్లి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. మూడు రోజులుగా కంది కొనుగోలు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. బీహార్, ఆదిలాబాద్ నుంచి వచ్చిన కూలీల సమస్య పరిష్కరం కాకపోడం వల్లనే కొనుగోళ్ల జాప్యం జరుగుతుందని అధికారులు తెలిపారు. కూలీల అంతర్గత విషయంతో రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదని వెంటనే కంది కొనుగోళ్లు చేపట్టాలని లేని పక్షంలో ఆందోళన చేపడు తామని హెచ్చరించారు. దీంతో స్పందించిన అధికారులు మధ్యాహ్నం నుంచి యథావిధిగా కంది కొనుగోలు ప్రారంభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రావుత్ మనోహర్, మాజీ సర్పంచ్ మస్కే తేజ్‌రావ్, బీఆర్ఎస్ నాయకులు సతీశ్ పవార్, గంభీర్ ఠాక్రే, విపిన్ ఖోడే, బీజేపీ మండలాధ్యక్షుడు వట్టిపెల్లి ఇంద్ర శేఖర్, నాయకులు బార్కడే రాము, వివిధ పార్టీల నాయకులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

- రూ.11లక్షలు విలువైన సొత్తు స్వాధీనం ● నిందితుడిపై పలు పోలీస్‌స్టేషన్లలో 40 కేసులు ● వివరాలు వెల్లడించిన సీఐ నిరంజన్‌రెడ్డి

వివరాలు వెల్లడిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి, ఫిబ్రవరి19: తాళం వేసిఉన్న ఇండ్లే లక్ష్యంగా వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగను పోలీసులు పట్టుకున్నారు. సుమారు రూ.11లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నిరంజన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. కొంత కాలంగా మెట్‌పల్లి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో వివిధ చోట్ల తాళం వేసి ఉన్న ఇండ్లలో చోరీలు జరుగుతున్న నేపథ్యంలో ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాలతో డీఎస్పీ రాములు, సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. ఈ నెల18న మల్లాపూర్ మండలం ముత్యంపేట శివారులోని నిజాం దక్కన్ చక్కెర ఫ్యాక్టరీ సమీపంలో స్థానిక ఎస్ఐ రాజు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టగా, అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా.. అతడు నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన మిట్టపల్లి లక్ష్మణ్ అలియాస్ రవి అలియాస్ పుండలిక్ విజయ్ అని తేలింది. లక్ష్మణ్ పలు దొంగతనాలకు పాల్పడినట్లుగా విచారణలో వెల్లడైంది. దీంతో లక్ష్మణ్‌ను అరెస్ట్ చేసి రూ.11లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలతోపాటు మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. లక్ష్మణ్‌పై నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల్లోని పలు పోలీస్‌స్టేషన్లలో 40కి పైగా చోరీకి కేసులు ఉన్నాయని చెప్పారు. దొంగను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐతోపాటు మల్లాపూర్ ఎస్ఐ రాజు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఈజీఎస్ కార్యాలయంలో చెత్తతో కూరుకు పోయిన మెట్లు

ఈజీఎస్ కార్యాలయం చెత్త మయం

నిర్మల్ జిల్లా కుభీర్‌లోని ఉపాధి హామీ కార్యాలయంలో పైకి ఎక్కే మెట్లు చెత్తతో నిండిపోయింది. పాత కుర్చీలు, సీసాలు, వాటర్ బాటిళ్లు, పనికి రాని కాగితాలు, ఊడ్చిన చెత్త, ఇనుప సామానుతో మెట్లు కనబడకుండా పోయాయి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. సంవత్సర కాలంగా చెత్త రోజురోజుకు పెరిగి పోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని సిబ్బంది పేర్కొంటున్నారు. ప్రతి రోజూ వచ్చే కూలీలు, రైతులు చెత్తను చూసి అసహనం వ్యక్తం చేస్తున్నారు. - కుభీర్, ఫిబ్రవరి 19

బ్యాంకులు మెరుగైన సేవలు అందించాలి

సంచికను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్, బ్యాంకు అధికారులు

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 19 : బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిశోర్‌కుమార్ తెలిపారు. బుధవారం నిర్మల్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కన్సాలిటేటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ రుణాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. వెనుకబడిన తరగతుల ప్రజలు, మహిళా స్వయం సహాయక సంఘాలు, రైతులకు అందించే రుణాల మంజూరులో ఆలస్యం చేయకూడదన్నారు. సమావేశం అనంతరం జిల్లా పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ 2026–26 సంచికను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్, నాబార్డు డీడీఎం వీరభద్రుడు, డీఆర్డీవో విజయలక్ష్మి, తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ రామారావు, ఆర్బీఐ ఎల్బీవో దేవ్‌జిత్‌బారువ పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం

ఫిర్యాదులు స్వీకరిస్తున్న నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల

భైంసా, ఫిబ్రవరి, 19 : బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి బుధవారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. బుధవారం భైంసాలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ఆమె మాట్లాడారు. అసాంఘిక శక్తులు, నేరస్తులపై కఠిన వైఖరి అవలంబిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామని అన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఆమె వెంట ఏఎస్పీ అవినాశ్ కుమార్, తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా

మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రాజు

బేల, ఫిబ్రవరి 19 : నూతన కార్యవర్గం ఎన్నికతో పాటు భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించే విధంగా ఏఐటీయూసీ కార్మిక సంఘం పని చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి రాజు అన్నారు. ఆదిలాబాద్ జిల్లా బేలలో బుధవారం మహా సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజు మాట్లాడుతూ బేలలో భవన నిర్మాణ కార్మికుల నూతన కార్యవర్గం ఎన్నుకున్నామన్నారు. భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో కార్మికుల మహాసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపైన చర్చించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు స్వామి, ఇబ్రహీం, ఫారూఖ్, షరీఫ్, రూపేశ్, వెంకటి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం పరిశీలన

నర్సాపూర్ (జీ), ఫిబ్రవరి 19 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ)లోని జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఉపాధ్యాయ, ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని బుధవారం ఆర్డీవో రత్న కళ్యాణి పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలని స్థానిక అధికారులను సూచించారు. అనంతరం తహసీల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, నయాబ్ తహసీల్దార్ మహ్మద్ అబ్దుల్ వహీద్, ఆర్ఐ వేణుగోపాల్ సిబ్బంది ఉన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీవో రత్న కళ్యాణి

విద్యార్థి దశలో అవగాహన అవసరం

ఉట్నూర్, ఫిబ్రవరి 19: విద్యార్థి దశలో అన్ని అంశాలపై అవగాహన అవసరమని ఉట్నూర్ ఐటీడీఏ ఉద్యానవన శాఖ అధికారి సందీప్ అన్నారు. గురువారం పీఎంశ్రీ పథకంలో భాగంగా క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా ఆదేశాల మేరకు గుడిహత్నూర్ మోడల్ స్కూల్, ఉన్నత పాఠశాల, యాపల్‌గూడ విద్యార్థులు ఉట్నూర్ ఉద్యవనాన్ని సందర్శించారు. రైతులు పండించే మామిడి, జామ, నిమ్మ, మునగ, సపోట తోటలో తిరుగుతూ పంటలపై అవగాహన కల్పించారు. రైతులు పండించే పంటల ద్వారా ప్రజలకు ఆహారం ఉత్పత్తి అవుతుందని వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కలిస్తున్న అధికారులు

చెక్కు అందజేత

తానూర్, ఫిబ్రవరి 19 : నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని ఏల్వత్ గ్రామానికి చెందిన కదం శోభబాయికి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. పీఏసీఎస్‌లో లోన్ తీసుకున్న ఆమెకు రూ. 2లక్షల ఇన్సురెన్స్ మంజూరు కాగా బుధవారం పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్‌రావుపాటిల్ మృతురాలి కుమారుడు కదం అంబాజీకి చెక్కు అందజేశారు. ఇక్కడ పీఏసీఎస్, ఏడీసీసీ బ్యాంకు సిబ్బంది ఉన్నారు.

సంస్థ మనదనే భావన కలగాలి

భైంసా, ఫిబ్రవరి 19 : ఆర్టీసీ సంస్థ మనదనే భావన ప్రతి ఉద్యోగిలో కలగాలని ఆర్టీసీ డిపో మేనేజర్ హరిప్రసాద్ అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా భైంసాలో పవర్ పర్ఫామెన్స్ త్రో ఓనర్ షిప్ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ప్రయాణికులను టెక్నాలజీ ఆధారంగా నడుచుకోవాలని సూచించారు.

విద్యార్థులు లక్ష్యంతో చదువుకోవాలి

భైంసా, ఫిబ్రవరి 19 : విద్యార్థులు లక్ష్యంతో చదువుకోవాలని సెంట్రల్ కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్ బందెల నగేశ్ అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా భైంసాలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కేరీర్ కౌన్సెలింగ్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికంగా చదువుకుంటూ ముందుకు సాగాలన్నారు. అనంతరం కొత్తగా ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జబ్బార్, వైస్ ప్రిన్సిపాల్ సాయినాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లను పూర్తి చేయాలి

దస్తురాబాద్, ఫిబ్రవరి 19 : ఈ నెల ఆఖరు వరకు ఇంటి పన్ను వసూళ్లను వంద శాతం పూర్తి చేయాలని ఎంపీవో రమేశ్ రెడ్డి ఆదేశించారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని పెర్కపల్లె, గొడిసేర్యాల గ్రామ పంచాయతీలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులు, నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. నర్సరీలో మొక్కలు ఎండిపోతే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, శివకృష్ణ, తదితరులు ఉన్నారు.

సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడిన ఎస్ఐ

కడెం,ఫిబ్రవరి19 : నిర్మల్ జిల్లా కడెం మండలంలోని ఫారెస్టు చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న దస్తురాబాద్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ గోకుల్ దాస్‌కు గుండెపోటు రావడంతో షాక్ గురైన సిబ్బంది కడెం ఎస్ఐ కృష్ణాసాగర్ రెడ్డికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఎస్ఐ ఘటన స్థలానికి వెళ్లి హెడ్ కానిస్టేబుల్‌కు సీపీఆర్ చేసి ప్రాణాన్ని కాపాడారు.

22న ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమావేశం

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 19: నిర్మల్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలో ఈ నెల 22వ తేదీన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలని డీఈవో రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో నిర్వహించే తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశాలకు హాజరుకావాలని ఆహ్వాన పత్రాలు పంపించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల ప్రగతిపై సమావేశం నిర్వహించాలన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకోండి

గుడిహత్నూర్, ఫిబ్రవరి 19 : ప్రభుత్వ కళాశాలల్లో అన్ని సౌకర్యాలతో కూడిన విద్యను అందిస్తున్నామని అడ్మిషన్లు తీసుకోవాలని అధ్యాపకులు పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రావణ్, అధ్యాపకులతో కలసి మండలంలోని తోషం, మన్నూర్, గుడిహత్నూర్, సీతాగొంది పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగరాజు, సంజీవ్‌రెడ్డి, శ్రీనివాస్, మీనా, పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

అభ్యాసన ఫలితాలు సాధించాలి

సోన్, ఫిబ్రవరి 19: నిర్మల్ జిల్లా సోన్ మండలం వెల్మల్ బొప్పారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న బోధనాభ్యాసన కార్యక్రమాలు (తొలిమెట్టు)ను బుధవారం మండల విద్యాధికారి తొడిశెట్టి పరమేశ్వర్ పరిశీలించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల స్థాయిని గుర్తించి బోధనోపకరణాలతో అభ్యాసన ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులు రాబోయే పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా ఇప్పటి నుంచే ముందస్తు ప్రణాళిక వేసుకొని చదవాలన్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

ఏకగ్రీవంగా తెలంగాణ జూడో సంఘం నూతన కార్యవర్గం

నూతనంగా ఎన్నికైన తెలంగాణ జూడో సంఘం కార్యవర్గ సభ్యులతో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్

కొత్తపల్లి, ఫిబ్రవరి 19: తెలంగాణ జూడో సంఘం నూతన కార్యవర్గాన్ని (2025–2029) బుధవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని హోటల్ మైత్రీలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్ పరమేశ్వర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి పరిశీలకులుగా జాయ్ వర్గీస్ కే, తెలంగాణ ఒలింపిక్ సంఘం నుంచి పీ మల్లారెడ్డి, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ నుంచి వీ శ్రీనివాస్ హాజరయ్యారు. నాలుగు ఏండ్ల పాటు నూతనంగా కార్యవర్గం పని చేస్తుందని ఎన్నికల అధికారి ఎన్ పరమేశ్వర్ ప్రకటించారు. తెలంగాణ జూడో సంఘం అధ్యక్షుడిగా బండ రాజ్ కుమార్ (వరంగల్), ప్రధాన కార్యదర్శిగా గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి (కరీంనగర్), ఉపాధ్యక్షులుగా కడారి అనంతరెడ్డి (కరీంనగర్), బాలరాజు (యాదాద్రి భువనగిరి), బాదినేని రాజేందర్‌రెడ్డి (జగిత్యాల), మాటేటి సంజీవ్‌కుమార్ (పెద్దపల్లి), సంయుక్త కార్యదర్శులుగా రాయిరెడ్డి శంకర్‌రెడ్డి (సిద్దిపేట), సిలివేరి మహేందర్ (పెద్దపల్లి), తిప్పారపు సత్యనారాయణ (రాజన్న సిరిసిల్ల), చందనగిరి నాగరాజు (వరంగల్), కోశాధికారిగా రాయిరెడ్డి మహేందర్‌రెడ్డి (సిద్దిపేట), కార్యవర్గ సభ్యులుగా ఏ సాయిచరణ్ (ఆదిలాబాద్), వై సాయికిరణ్ (నిర్మల్), కే తిరుపతిగౌడ్ (రాజన్న సిరిసిల్ల), కే రాకేశ్ (ఆసిఫాబాద్), ఏ రమేశ్‌రెడ్డి (మంచిర్యాల), ఎం శ్రీనివాస్ (జగిత్యాల) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. కాగా తెలంగాణ జూడో సంఘానికి చైర్మన్‌గా శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని, తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌ను పలు జిల్లాల నుంచి హాజరైన జూడో సంఘం ప్రతినిధులు సన్మానించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

నర్సాపూర్ (జీ), ఫిబ్రవరి 19 : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో లింబాద్రి అన్నారు. బుధవారం నర్సాపూర్(జీ)లోని మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన చేయాలని, అర్హులైన వారిని గుర్తించాలని అన్నారు. సర్వేను తప్పులు లేకుండా పారదర్శకంగా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల వసతులు కల్పించాలని సూచించారు. ఎంపీవో అబ్దుల్ రహీం, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యంతరాల స్వీకరణకు గడువు పెంపు

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 19: వైద్య కళాశాలలో ఖాళీల భర్తీకి చేపట్టిన నియామకాల దరఖాస్తులపై అభ్యంతరాల స్వీకరణ గడువు ఈ నెల 24వ తేదీ వరకు పొడిగించినట్లు నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వైద్య కళాశాలలో పొరుగు సేవల పద్ధతిన 32 ఖాళీల భర్తీ నియామక ప్రక్రియలో భాగంగా అర్హులైన అభ్యర్థుల అభ్యంతరాల స్వీకరణ గడువు ఈ నెల 20 నుంచి 24 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఖాళీల భర్తీ ప్రక్రియ కొరకు డాక్టర్ అంకిత్‌రాజ్‌ను నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు. అభ్యంతరాల స్వీకరణపై ఎటువంటి సందేహాలున్నా నోడల్ అధికారి మొబైల్ నెంబర్ 9494392355 మెయిల్ ఐడీ recruitmentgmcnirmal@ gmail.comను సంప్రదించాలని సూచించారు. అర్హులపై ఎటువంటి అభ్యంతరాలున్నా నిర్మల్ అధికారిక వెబ్‌సైట్ నందు పొందుపరిచిన గూగుల్ ఫారంను నింపి తమ అభ్యంతరాలు తెలపవచ్చని తెలిపారు

విద్యార్థులకు కంటి పరీక్షలు

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

భైంసా, ఫిబ్రవరి, 19 : నిర్మల్ జిల్లా భైంసా ఏరియా దవాఖానలో బుధవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్ మాట్లాడుతూ గతంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆప్తాల్మిక్ అధికారుల ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి 1385 మందికి కంటి లోపాలు ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. అనంతరం అద్దాలు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో డీసీహెచ్ సురేశ్, ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ కాశీనాథ్, డాక్టర్ రజిత పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న కళాశాల సిబ్బంది

బోథ్, ఫిబ్రవరి 19 : ఆదిలాబాద్ జిల్లా బోథ్ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న దేవరాజు ఈ నెల 5వ తేదీన గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం ఆయన కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా బోథ్ మోడల్ స్కూల్ జూనియర్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు, పోషకులు, రాష్ట్రంలో ఉన్న మోడల్ స్కూల్ సిబ్బంది, బోథ్ మండల టీచర్లు ఆర్థికంగా తోడ్పాటు అందించారు. రూ.1,51,121 సమకూర్చి దేవరాజ్ కుటుంబానికి అందజేశారు. ఇక్కడ కళాశాల సిబ్బంది ఉన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 19 : ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని ఆర్టీసి రీజియనల్ మేనేజర్ సోలోమాన్ అన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు రెండోరోజు నిర్మల్‌లో పవర్ శిక్షణను ఆదిలాబాద్ ఆర్ఎం ప్రారంభించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు

దొంగలించిన కంప్యూటర్లు కోర్టు ద్వారా అందజేత

ఖానాపూర్ రూరల్, ఫిబ్రవరి 19 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం మస్కాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చోరీకి గురైన కంప్యూటర్లు కోర్టు ద్వారా ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌కు అందజేశారు. జనవరి 18వ తేదీన చోరీకి గురైన కంప్యూటర్లు గ్రామ శివారులో కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి పోలీసులు వెళ్లి కంప్యూటర్లను స్వాదీనం చేసుకొని కోర్టుకు అప్పగించారు.

లబ్ధిదారులకు అవగాహన సదస్సు

దస్తురాబాద్, ఫిబ్రవరి 19 : నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని దేవునిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ అబ్దుల్ ఖ్యియూమ్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై, నాలుగు విడుతల్లో వచ్చే డబ్బులపై,ప్రభుత్వం అందించే ఉచిత ఇసుక, సిమెంట్,నిర్మాణానికి కావాల్సిన సామగ్రి గురించి వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వంశీ నాయక్, నాయకులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే లక్ష్యం

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 19 : పేదలను ఆదుకోవడమే తమ లక్ష్యమని హైమన్ డార్ఫ్ బెట్టి ఎలిజిబెత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దుర్వ సంతోష్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం శంకర్ గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బగూడకు చెందిన మాజీ సర్పంచ్ తుమ్రం లక్ష్మణ్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం దుర్వ సంతోష్ పరామర్శించి నిత్యావసర సరుకులతో పాటు నూతన వస్త్రాలు అందజేశారు. ఇక్కడ రంగుల రాజు, వెంకటేశ్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్

ఎదులాపురం, ఫిబ్రవరి 19 : క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఉషూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్ సాగర్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉషూ పోటీలకు ఆయన హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. క్రీడాకారులు చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. ఉషూ విభాగంలో స్పోర్ట్స్ కోట కింద పోస్టల్ శాఖలో ఉద్యోగం రాగా ఎస్ఎస్ఈలో శిక్షణ తీసుకుంటున్న రాథోడ్ స్వాతిని సన్మానించారు. కార్యక్రమంలో ఉషూ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ఉమర్, పేట సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పార్థసారథి, సాయి, ఉషూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి గణేశ్, సతీశ్, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ వీరేశ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి

ఇచ్చోడ(సిరికొండ), ఫిబ్రవరి 19: ప్రజలు సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని సిరికొండ ఎస్ఐ శివరాం సూచించారు. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని రిమ్మ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజల కోసం పోలీసులు పని చేస్తారని అన్నారు. తెలియని వారికి ఫోన్, ఆధార్ కార్డు, పాన్ కార్డు నంబర్ ఇవ్వద్దని అన్నారు. ఇతర వివరాలు అడిగినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ కాతే రమేశ్, కానిస్టేబుల్ అర్జున్, మాజీ సర్పంచ్ అనిల్, ఎంపీపీ అమృత రావ్, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న కళాకారులు

పుస్తక రచన అభినందనీయం

అవార్డు అందజేస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సాయిప్రసాద్

ఉట్నూర్, ఫిబ్రవరి 19: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ అనిత బ్రేకింగ్ ఏ స్వేట్ ది పాత్ టూ పిక్ ఫిట్‌నెస్ పుస్తకం రచించడం అభినందనీయమని ఆ కళాశాల ఇన్‌చార్జి, వైస్ ప్రిన్సిపాల్ సాయి అన్నారు. బుధవారం ఉట్నూర్‌లోని కళాశాలలో అధ్యాపకురాలు డాక్టర్ అనితను అభినందించారు. ఈ పుస్తకాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా ఆవిష్కరించారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.